సాక్షి
శ్రీకాకుళం

మంగళవారం । 14 । అక్టోబర్ । 2025



అధికారులు హాజరు కావాలి

గ్రీవెన్స్‌కు వినతులు వెల్లువెత్తాయి. కలెక్టర్ వినతులు స్వీకరించారు.

- 8లో



విద్యుత్ షాక్‌తో..

విద్యుత్ షాక్‌తో ఓ వ్యక్తి మృతి చెందాడు. పుల్లాజీపేటలో ఘటన జరిగింది.

- 8లో

26న చదరంగం పోటీలు

టెక్కలి: ఆలిండియా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 26న టెక్కలిలో జిల్లా స్థాయి స్కూల్స్ చాంపియన్ ట్రోఫీ చదరంగం పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలిండియా చెస్ అసోసియేషన్ కమిటీ సభ్యుడు ఎస్.భీమారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అక్కవరం సమీపంలో గల ఆల్ఫాజెన్ పాఠశాలలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో పాల్గొనాలనుకునే వారు రూ.300 ప్రవేశ రుసుం చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి రూ.10 వేల నగదుతో పాటు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 9912559735, 9491802386 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

న్యూస్‌రీల్

'సీబీఐతోనే దర్యాప్తు చేయించాలి'



నరసన్నపేట: కల్తీ మద్యం వ్యవహారంపై ప్రభుత్వం వేసిన సిట్ బృందం దర్యాప్తులో నిజాలు నిగ్గు తేలే పరిస్థితి లేదని, ప్రభుత్వం సీబీఐ తోనే దర్యాప్తు చేయించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ మరోసారి డిమాండ్ చేశారు. కల్తీ మద్యం తీరు, కూటమి ప్రభుత్వం వ్యవహారంపై పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నాలు, ర్యాలీలు విజయవంతం అయ్యాయన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు, సామాన్య ప్రజలు అధిక సంఖ్య లో పాల్గొన్నారని ఇప్పటికైనా ప్రభుత్వం తన వైఖరి మార్చుకోవాలని కోరారు. కల్తీ మద్యం వ్యవహారాన్ని వెనకేసుకు రాకుండా నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. మంగళవారం ఎచ్చెర్ల నియోజకవర్గం లావేరు మండలం లక్ష్మీపురంలో రచ్చ బండ కార్యక్రమంలో పాల్గొంటానని, కోటి సంతకాలు త్వరిత గతిన పూర్తి చేయాలని కార్యకర్తలను కోరారు.

'ధాన్యం రవాణా వాహనాలకు జీపీఎస్ తప్పనిసరి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల నుంచి మిల్లులకు తరలించేందుకు కొత్త వాహనాల నమోదు ప్రక్రియ ప్రారంభమైందని, ధాన్యం రవాణా చేసే ప్రతి వాహనానికి కచ్చితంగా జీపీఎస్ పరికరం అమర్చుకోవాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ స్పష్టం చేశారు. దీనికోసం ఆసక్తి ఉన్న వాహనదారులు ముందుగా రూ.3,068లు, (జీఎస్టీతో కలిపి) చెల్లించి, జీపీఎస్ అమర్చుకోవాలని ఆ తర్వాతే జిల్లాలోని ఆయా మండలాల్లో ఉన్న రైతు సేవా కేంద్రాల వద్ద తమ వాహన వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. జీపీఎస్ లేకుండా రిజిస్ట్రేషన్ సాధ్యం కాదని తేల్చి చెప్పారు. రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకున్న వాహనాలకు మాత్రమే రవాణా ఖర్చులను ప్రభుత్వ నిబంధనల మేరకు చెల్లిస్తుందని, రవాణా కాంట్రాక్టు ఆశించే వాహనదారులు ఆలస్యం చేయకుండా, వెంటనే జీపీఎస్ అమర్చుకొని, ఆయా రైతు సేవ కేంద్రాలకు వెళ్లి వాహనాల వివరాలను తక్షణమే నమోదు చేసుకోవాలని జేసీ కోరారు.

కళింగపట్నం పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ



కళింగపట్నం పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ సౌరభ్‌గౌర్

గార: కళింగపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సౌరభ్‌గౌర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లాకు వచ్చిన ఆయన సోమవారం సాయంత్రం పీహెచ్‌సీకి వచ్చి స్టాఫ్ నర్సు డి.శాంతామణి నుంచి వివరాలు సేకరించారు. వైద్యులు సమ్మె చేయటం వల్ల ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోర్టు కళింగపట్నంకు చెందిన కెప్టెన్ మైలపిల్లి జనార్దన్ మాట్లాడుతూ తీర ప్రాంతంలోని మత్స్యకారులకు ఆరోగ్య ఉపకేంద్రాల్లో 24 గంటలు వైద్య సేవలందేలా చూడాలని కోరారు.

చేతికొచ్చిన 1010 రకం ధాన్యం



అడ్డపనసలో రోడ్డుపై కుప్పగా వేసిన 1010 రకం ధాన్యం

సారవకోట: మండలంలోని వెంకటాపురం, గొర్రిబంద, అడ్డపనస, అంగూరు, వడ్డినవలస తదితర గ్రామాల్లో సాగు చేసిన 1010 రకం ధాన్యం పంట చేతికొచ్చింది. సుమారు 100 ఎకరాల్లో మండలంలో ఈ రకం వరి సాగు చేయగా ప్రస్తుతం కోత యంత్రాలతో కోతలు చేపట్టి పచ్చి ధాన్యంను వ్యాపారులు రైతుల నుంచి కొనుగోలు చేసి లారీలలో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు.

'పక్కా ప్రణాళికతో ధాన్యం కొనుగోలు'

శ్రీకాకుళం పాతబస్టాండ్: రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ముందస్తుగా పక్కా ప్రణాళికతో ధాన్యం సేకరణ ప్రక్రియను సమర్థంగా చేపట్టాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఆయన అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉన్నతాధికారులు, పౌరసరఫరాల శాఖ మంత్రి ఇచ్చిన సూచనలను వివరించారు.

ఇచ్ఛాపురం: ర్యాలీ చేస్తున్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ తదితరులు



పలాస: నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు



బ్రాండ్ నకిలీపై.. బిగిసిన పిడికిలి

రాజీనామా చేయాలి

కల్తీ మద్యానికి బాధ్యత వహిస్తూ సీఎం చంద్రబాబు, ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర రాజీనామా చేయాలి. రాష్ట్రంలో కల్తీ మద్యాన్ని కుటీర పరిశ్రమలా మార్చేశారు. ఈ మద్యం వల్ల పోయిన ప్రాణాలు తీసుకురాగలరా..?

– తమ్మినేని సీతారాం, మాజీ స్పీకర్

ప్రజల ప్రాణాలతో చెలగాటం

కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఆ మద్యంపై కూడా అదనపు చార్జీలు వేస్తున్నారు. కల్తీ మద్యం సూత్రధారి అధికార పార్టీ ఎమ్మెల్యేనే. పలాసలో అయితే అల్లుడు టాక్స్ పేరుతో సిండికేటు నడుస్తోంది.

– సీదిరి అప్పలరాజు, మాజీ మంత్రి

నకిలీ మద్యంపై ప్రజా యుద్ధం

- కదం తొక్కిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు, మహిళలు
- పోలీసుల ఆంక్షలు, అడ్డంకులు అధిగమించి నిరసన
- వర్షాన్ని సైతం లెక్క చేయకుండా ర్యాలీలు, బైక్ ర్యాలీలు, మానవహారం, ధర్నాలతో హోరెత్తిన నియోజకవర్గ కేంద్రాలు

'బ్రాండ్ ' ముసుగులో జరుగుతున్న మద్యం నకిలీ దందాపై వైఎస్సార్‌సీపీ యుద్ధం ప్రకటించింది. బ్రాండెడ్ మద్యం పేరుతో ఒకవైపు ఎక్కువ ధరలు పెట్టి దోచుకుంటూ.. మరోవైపు గరళాన్ని తలపించే నకిలీ సరుకును పేదవారి గొంతులో పోస్తూ.. వారి ఇళ్లూ ఒళ్లు గుల్ల చేస్తున్నారని పార్టీ శ్రేణులు విరుచుకుపడ్డాయి. 'మందు' బాబు నకిలీ దందాలపై వైఎస్సార్‌సీపీ మోగించిన సమరభేరికి అనుగుణంగా జిల్లాలో పార్టీ శ్రేణులు కదం తొక్కాయి. అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలు, మానవహారాలు, ధర్నాలతో హోరెత్తాయి. పోలీసు ఆంక్షలు సైతం వారి నిరసన హోరు ముందు పటాపంచలయ్యాయి. వారి నినాదాలు, విమర్శల్లో ప్రజాగ్రహం ప్రస్ఫుటమైంది.



నరసన్నపేటలో నిరసన తెలియజేస్తూ..

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

నకిలీ మద్యం మహమ్మారిపై వైఎస్సార్‌సీపీ శ్రేణులు, మహిళలు రణభేరి మోగించారు. నకిలీ మద్యం తయారీని ఒక పరిశ్రమగా మార్చి దాన్ని రాష్ట్ర వ్యాప్తంగా సరఫరా చేస్తున్న తీరును ఎండగట్టారు. ప్రజల ప్రాణాలను తీసేసే ఈ మద్యానికి మూల కారకులు టీడీపీ నాయకులేనని, వేల కోట్ల కుంభకోణంపై సీబీఐ విచారణ జరిపించాలని, కల్తీ మద్యంలో ప్రమేయం ఉన్న వారందరినీ అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం జిల్లా వ్యాప్తంగా ర్యాలీలు, మోటార్ బైక్ ర్యాలీలు, మానవహారం, ధర్నా వంటి నిరసన కార్యక్రమాలతో హోరెత్తించారు. అనంతరం ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులకు డిమాండ్ పత్రాలు అందజేశారు. వాన పడుతున్నా, పోలీసులు అడ్డుకుంటున్నా ఎవరూ వెనక్కి తగ్గలేదు. పోలీసులు ముందు అంగీకరించి తర్వాత అడ్డుకోవాలని చూసినా నిరసనలు కొనసాగించారు.

ఇచ్ఛాపురంలో వానను సైతం లెక్క చేయకుండా..

ఇచ్ఛాపురంలో ఉదయం 10 గంటల వరకు వాన పడినా వైఎస్సార్‌సీపీ శ్రేణులు వెనక్కి తగ్గలేదు. మాజీ స్పీకర్, పార్టీ పార్లమెంట్ సమన్వయకర్త తమ్మినేని సీతారాం, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ తదితరుల ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి ర్యాలీగా బయల్దేరి ఎక్సైజ్ కార్యాలయం వరకు వెళ్లారు. మార్గమధ్యంలో పోలీసులు ఆపినా వైఎస్సార్‌సీపీ నాయకులు ముందుకు సాగారు. ర్యాలీ అనంతరం ఎక్సైజ్ సీఐకి వినతి పత్రం అందజేశారు. నిరసన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, రాష్ట్ర కార్యదర్శి(పార్లమెంట్) దుంపల లక్ష్మణరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు ఉలాల భారతి, మున్సిపల్ చైర్‌పర్సన్ పిలకా రాజ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పలాసలో మానవహారం..

పలాసలో స్థానిక శ్రీనివాస లాడ్జి జంక్షన్ నుంచి మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ ప్రారంభించారు. అక్కడే మానవహారం నిర్వహించారు. అక్కడి నుంచి ఎక్సైజ్ సూపరింటెండెంట్ టాస్క్‌ఫోర్స్ కార్యాలయం వరకు వాన జల్లుల నడుమ ర్యాలీగా వెళ్లారు. మార్గం మధ్యలో పోలీసులు అడ్డుకోవడానికి యత్నించారు. రోప్ పట్టుకుని నిలువరించారు. కానీ మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు తోసుకుని ముందుకు దూసుకుపోయారు. అనంతరం సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట ప్లకార్డులతో నిరసన ప్రదర్శన చేసి, అనంతరం అధికారులకు వినతి పత్రం అందజేసి మాట్లాడారు.



బైక్ ర్యాలీ

చిరు జల్లుల మధ్య ఆమదాలవలసలో వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి సమన్వయకర్త చింతాడ రవికుమార్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ ప్రారంభించారు. ఓవర్ బ్రిడ్జి జంక్షన్ నుంచి రైల్వే స్టేషన్ కూడలి, కృష్ణాపురం జంక్షన్ మీదగా మెట్టక్కివలసకు చేరుకుని, అక్కడే ఉన్న ఎక్సైజ్ సీఐ కార్యాలయం వద్ద ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలియజేశారు. అనంతరం సీఐకి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డేపల్లి రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కదం తొక్కుతూ..



నకిలీ మద్యంపై మాజీ ఎమ్మెల్యే, సమన్వయకర్త గొర్లె కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎచ్చెర్ల నియోజకవర్గంలో రణస్థలంలో భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. రామతీర్థం కూడలి నుంచి రణస్థలంలో భారీగా ర్యాలీ చేశారు. అడుగడుగునా అడ్డుకునేందుకు పోలీసులు యత్నించారు. అయినప్పటికీ మహిళలతో కలిసి వైఎస్సార్‌సీపీ శ్రేణులు కదం తొక్కాయి. ఎక్సైజ్ సీఐ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేసి, అనంతరం వినతి పత్రం అందజేశారు.

ఆంక్షల నడుమ..



ధర్మాన రామ్ మనోహర్ నాయుడు ఆధ్వర్యంలో సూర్య మహల్ జంక్షన్ నుంచి ఎక్సైజ్ సీఐ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్తుండగా పోలీసులు అడ్డుకుని, ఎక్కడికక్కడ కార్యకర్తలను, మహిళలను నిలువరించారు. అయినప్పటికీ ముందుకు సాగి సీఐకి వినతి పత్రం అందజేశారు. అంతకు ముందు ప్లకార్డులతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర వెలమ విభాగం అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, తూర్పు కాపు రాష్ట్ర విభాగం అధ్యక్షుడు మామిడి శ్రీకాంత్, రాష్ట్ర మహిళా కార్యదర్శి కామేశ్వరి, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు చల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో పోలీసుల ఆంక్షలు

అడ్డంకులు అధిగమించి...



పోలీసులు ఆంక్షలు విధించినా మహిళలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాతపట్నంలో వెనక్కి తగ్గలేదు. మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం, పాత బస్టాండ్ వద్ద నిరసన ర్యాలీ ప్రారంభించారు. పోలీసులు అడ్డుకునే యత్నం చేయగా వాగ్వాదం చోటు చేసుకుంది. అయినప్పటికీ పోలీసులు అడ్డుకోవడంతో కొందరు నాయకులు ఎక్సైజ్ సీఐ కార్యాలయం వెళ్లి వినతి పత్రం అందజేశారు.

వానను సైతం లెక్కచేయక..



టెక్కలి నియోజకవర్గ కేంద్రంలో సమన్వయకర్త పేరాడ తిలక్ ఆధ్వర్యంలో కల్తీ మద్యానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్షం పడటం వల్ల ఎక్సైజ్ కార్యాలయం ఎదుట పాత జాతీయ రహదారిపై నినాదాలు చేశారు. ప్లకార్డులు పట్టుకుని ప్రభుత్వం తీరును దుయ్యబట్టారు. అనంతరం టెక్కలి ఎక్సైజ్ సీఐకికు వినతి పత్రం అందజేశారు.

నిరసనగళం..



నరసన్నపేటలో కల్తీ మద్యానికి వ్యతిరేకంగా పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో నిరసన ర్యాలీతో పాటు ధర్నా చేశారు. వాన జల్లుల మధ్య పార్టీ కార్యాలయం నుంచి ఎక్సైజ్ సీఐ కార్యాలయం వరకు ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీఐ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు.

జనసేన నేత అరాచకం



గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందిన జనసేన నేత దాసరి రాజు అత్త రమణమ్మ

- అత్తామామలను బాదిన ఇచ్ఛాపురం జనసేన ఇన్‌చార్జి దాసరి రాజు
- అదనపు కట్నం కోసం వేధింపులు
- అధికారమదంతో అత్తామామలపై దాడి
- ఎఫ్‌ఐఆర్ నమోదు చేసిన పోలీసులు
- మంత్రి నాదెండ్ల పర్యటన నేపథ్యంలో ప్రాధాన్యత

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: కూటమి ప్రభుత్వం అధికారం ఉందన్న అహంకారమో.. ఎమ్మెల్యే అండదండలు ఉన్నాయన్న ధైర్యమో గానీ ఇచ్ఛాపురం నియోజకవర్గ జనసేన సమన్వయకర్త దాసరి రాజు తన అత్తమామలు, భార్యపైనే దాడికి తెగబడ్డారు. ఇష్టారీతిన కొట్టడంతో వారి శరీరంపై గాయాలయ్యాయని వైద్యులు కూడా నిర్ధారించారు. ఈ ఘటనతో జనసేనలోనే కాదు జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. జనసేన నేత, మంత్రి నాదెండ్ల మనోహర్ జిల్లాకు వచ్చిన సమయంలో ఈ ఘటన మరింత ప్రాధాన్యత సంతరించుకుంది.

ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన దాసరి రాజుకు తొలి భార్యతో విడాకులు అయ్యాక పక్క వీధిలోనే ఉంటున్న కాళ్ల అప్పన్న, రమణమ్మల కుమార్తె మోహినితో 2018లో వివాహం జరిగింది. పెళ్లి సమయంలో కట్నం రూపంలో దాసరి రాజుకు అత్తవారు ఐదు లక్షల రూపాయలతో పాటు బుల్లెట్ బైక్‌ను ముట్టజెప్పారు. అదనపు కట్నం కోసం భార్యను శారీరకంగా, మానసికంగా వేధించడంతో పాటు అత్తామామలతో తరచూ తగాదాలు పడేవాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు కలగడంతో అదనపు కట్నం, ఆస్తిలో వాటా తీసుకురావాలంటూ భార్యపై ఒత్తిడి తెచ్చి పిల్లలతో భార్యను అత్తారింటికి పంపించేశాడు. ప్రస్తుతం భార్య మోహిని తన ఇద్దరు ఆడ పిల్లలతో రెండేళ్లుగా పుట్టింటిలోనే ఉంటోంది. రాజకీయంగా పేరును సంపాదించుకున్న రాజు తనకు విడాకులు కావాలంటూ ఈ ఏడాది సోంపేట జిల్లా కోర్టు మెట్లెక్కాడు. ఈ నెల 11 శనివారం సాయంత్రం సమయంలో తన కుటుంబ సభ్యులు అన్న కుమారుడు దాసరి దీపక్ యాదవ్, సోదరి కరగాన రోజా, తల్లి ఆదిలక్ష్మీలతో కలసి అత్తవారింటికి వెళ్లి బాహాబాహికి దిగారు. తన భర్త పూటుగా మద్యం సేవించి తన తల్లి, తండ్రిపై విచక్షణారహితంగా దాడిచేశారంటూ మోహిని అదే రోజు రాత్రి ఇచ్ఛాపురం పట్టణ పోలీస్ స్టేషన్‌లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. రాజు అత్తామామలకు ప్రభుత్వాస్పత్రిలో వైద్యం చేయగా, గాయాలైనట్టు తేలింది. దీంతో సీఐ ఎం.చిన్నంనాయుడు కేసు నమోదు చేశారు.



తనకు గాయమైందని చూపిస్తున్న మామ అప్పన్న

మంత్రి నాదెండ్ల పట్టించుకున్నారా?


జనసేన ఇన్‌చార్జి దాసరి రాజు నిర్వాకం మీడియాలో వచ్చింది. జనసేనలో కూడా చర్చనీయాంశమైంది. కుటుంబీకులపైనే దాడి చేశారంటే మిగతా వారిపై ఇంకెంత రెచ్చిపోతారన్న చర్చ నడిచింది. ఇదే సమయంలో మంత్రి నాదెండ్ల మనోహర్ జిల్లాకు వచ్చారు. అధికారిక పర్యటనలో భాగంగా వచ్చిన మంత్రి నాదెండ్ల దృష్టికి ఈ విషయం వెళ్లిందా? జనసేన నాయకులు తీసుకెళ్లారా? తీసుకెళ్తే మంత్రి సీరియస్ అవ్వడమో? మందలించడం చేశారా? అన్నది చర్చనీయాంశంగా మారింది.

'దగ్గు సిరప్‌లు నిలిపివేశాం'

శ్రీకాకుళం క్రైమ్ : వివాదాస్పద దగ్గు సిరప్ కోల్డ్‌రిఫ్ జిల్లాకు సరఫరా అవ్వడం లేదని, ముందుజాగ్రత్త చర్యగా విశ్లేషణాత్మక నివేదిక వచ్చేవరకు రెస్పిఫ్రెష్ దగ్గు సిరప్‌ను నిలిపివేశామని జిల్లా ఔషధ నియంత్రణాధికారి (ఏడీ) ఎం.చంద్రరావు స్పష్టం చేశారు. 'సాక్షి'లో 'నిఘా నిద్దరోతోంది' కథనానికి ప్రతిస్పందిస్తూ ఏడీ సోమవారం ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో నాలుగేళ్లుగా 548 నమూనాలు సేకరించి విశ్లేషించగా 11 మందులు ప్రామాణిక నాణ్యత లేనివిగా గుర్తించామని, 15 తీర్పుల్లో 13 తీర్పులకు శిక్షలు పడ్డాయన్నారు. ఫార్మాసిస్టుల పర్యవేక్షణ ఫార్మసీ కౌన్సిల్‌లో ఉన్నప్పటికీ గైర్హాజరీపై చర్యలు తీసుకుంటున్నామన్నారు.

రైతు ఖాతాకు ఐదారు గంటల్లోనే ధాన్యం సొమ్ము

- మంత్రి నాదెండ్ల మనోహర్



మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో కాకుండా, కేవలం ఐదు నుంచి ఆరు గంటల్లోనే వారి ఖాతాల్లో సొమ్ము జమ చేస్తామని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. సోమవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో రైస్ మిల్లర్స్, వివిధ రైతు సంఘాలు, అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. తేమ శాతం పరీక్షల్లో ఏకరూపత కోసం రైతు సేవా కేంద్రాలు, రైస్ మిల్లుల వద్ద ఒకే కంపెనీకి చెందిన యంత్రాలను ఏర్పాటు చేస్తామని అన్నారు. సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాలలో గతంలో 11.45 లక్షల టన్నులు కొనుగోలు చేయగా, ఈసారి లక్ష్యాన్ని 13 లక్షల టన్నులకు పెంచినట్లు తెలిపారు. రైతులు నమ్మకం ఉన్న చోట ధాన్యం విక్రయించే వెసులుబాటు తీసుకువచ్చిందన్నారు. అలాగే నూరు శాతం సబ్సిడీతో రైతులకు టార్పాలిన్లను అందిస్తామని, శ్రీకాకుళంలో 6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఉత్తరాంధ్రలో వారం రోజుల్లోపే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని మంత్రి ప్రకటించారు. సమావేశంలో పౌర సరఫరాల శాఖ కమిషనర్ సౌరభ్ గౌర్, చైర్మన్, ఎండీ మనజీర్ జిలానీ సమూన్, డైరెక్టర్ గోవిందరావు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ కుమార్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, రైతు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

శ్రీకాకుళం: బదిలీ అయినా కొత్త పాఠశాలల్లో చేరని ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొత్తకోట రామ్మూర్తి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనెల రమేష్ విద్యాశాఖను సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రతీ బదిలీ పొందిన ఉపాధ్యాయుడు కొత్త పాఠశాలలో చేరేటట్లు చర్యలు చేపట్టాలన్నారు. వర్క్ అడ్జస్ట్‌మెంట్ ద్వారా మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 16,000 మంది మెగా డీఎస్సీ టీచర్లను సకాలంలో పాఠశాలలకు పంపిస్తున్నందుకు, బోధన సిబ్బంది కొరత తీర్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. అయితే మెగా డీఎస్సీ ఎస్టీటీ - స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులకు జీవో నంబర్ 90 మెరిట్ కం రోస్టర్ ప్రకారం (రూల్ ఆఫ్ రిజర్వేషన్) కౌన్సెలింగ్ చేయకపోవడం దురదృష్టకరమన్నారు.

దేవాలయాల్లో హుండీలు చోరీ

బూర్జ: మండలంలోని కంట్లాం పంచాయతీ లచ్చయ్యపేట గ్రామం, కేకేరాజపురం గ్రామాల్లో ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు ఆయా గ్రామస్తులు తెలియజేశారు. లచ్చయ్యపేట గ్రామంలోని నీలమణి దుర్గ అమ్మవారి దేవాలయంలో ఉన్నటువంటి రెండు హుండీలు గుర్తు తెలియని వ్యక్తులు తీసుకెళ్లినట్లు మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు సూరపు ఉదయ్ కుమార్ తెలిపారు. అలాగే కేకే రాజపురం గ్రామంలో ఉన్న ఉమాతరబేశ్వర దేవాలయం (శివాలయం)లో హుండీ పగలు గొట్టి, డబ్బులు, వెండి తదితర వస్తువుల చోరీ చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. వరుస దొంగతనాలు జరగడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

నివేదిక ఇవ్వరు.. చర్యలు తీసుకోరు..?

- ఎచ్చెర్ల సీడీపీవోపై కాంట్రాక్టర్ ఫిర్యాదు
- లంచం అడిగారని ఆరోపణ
- జేసీకి నివేదిక ఇవ్వని ఐసీడీఎస్ పీడీ
- చర్యలు తీసుకోని ఉన్నతాధికారులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎచ్చెర్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ సెంటర్లకు బాలామృతం ప్యాకెట్లు సరఫరా చేసే రవాణా కాంట్రాక్టును పైడి వెంకటరమణ చేస్తున్నాడు. ఈ అగ్రిమెంట్ 2026 మార్చి వరకు ఉంది. ప్రాజెక్టు పరిధిలో 116 అంగన్‌వాడీ సెంటర్లకు ఈయనే కాంట్రాక్టర్. ప్రభుత్వం రవాణా చార్జీ కింద ఒక్కో ప్యాకెట్‌కు రూ.5లు చొప్పున చెల్లిస్తోంది. ఇటీవల 14 నెలల బిల్లులు సుమారు రూ.1,75,000లు విడుదలయ్యాయి. వీటిలో ప్యాకెట్‌కు రూ.0.75 పైసలు వంతున.. అంటే సుమారు రూ.40 వేలు లంచంగా ఇవ్వాలని సీడీపీవో డోల పాపినాయుడు, డేటా ఎంట్రీ ఆపరేటర్ శ్రీనివాసరావులు డిమాండ్ చేశారు. దీంతో వీరిరువురిపై పూర్తి ఆధారాలతో ఈనెల 22న కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో కాంట్రాక్టర్ పైడి వెంకటరమణ ఫిర్యాదు చేశాడు.

ఫిర్యాదు చేసి 15 రోజులైనా...

మహిళా, శిశు సంక్షేమ శాఖ పరిధిలో ఎచ్చెర్ల చైల్డ్ డవలప్‌మెంట్ ప్రాజెక్టు అధికారి (సీడీపీవో) డోల పాపినాయుడుపై ఫిర్యాదు వచ్చి 15 రోజులు పూర్తయినా ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదు. సీడీపీవో అవినీతిపై జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తన చాంబర్‌లో నేరుగా దర్యాప్తు చేసి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పూర్తి నివేదిక వెంటనే అందజేయాలని, అనంతరం ఆయనపై సస్పెన్షన్ వేటు



ఐసీడీఎస్ పీడీ కార్యాలయం ఇచ్చిన ఎండార్స్‌మెంట్

ఉంటుందని ఆ సమావేశంలోనే ఐసీడీఎస్ పీడీకి స్పష్టం చేశారు. అయినా ఇప్పటివరకు ఐసీడీఎస్ పీడీ నివేదికలు జేసీ కార్యాలయానికి ఇంతవరకు అందజేయలేదు. ఒకసారి షోకాజ్ నోటీసుకి సమాధానం తెలిపినా.. దానిపై జేసీ సంతృప్తి చెందలేదు. స్పష్టమైన నివేదిక అందజేయాలని ఆదేశించారు.

మరలా ఫిర్యాదు

15 రోజుల ముందు చేసిన ఫిర్యాదుపై ఎటువంటి చర్యలు లేకపోవడంతో వెంకటరమణ మరలా గత వారం పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై మరలా పీడీ కార్యాలయం నుంచి విచారణకు జేసీ పిలిపించారు. అయితే పీడీ కార్యాలయం వారు జేసీ లేని సమయంలో వెళ్లి, ఆయన లేరని దాటవేస్తున్నారు. వారంలో రోజులుగా జేసీని వారు కలవలేదు. జేసీ ఆదేశాల మేరకు అక్కడ పనిచేస్తున్న సీడీపీవో పాపినాయుడు, డేటా ఎంట్రీ ఆపరేటర్ శ్రీనివాసరావులపై చర్యలు తీసుకోవాల్సి ఉన్నా ఐసీడీఎస్ పీడీ ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. దీంతో ఆయన వీరిద్దరినీ కాపాడుతున్నారని తెలుస్తోంది. వెంకటరమణ చేసిన ఫిర్యాదుపై చర్యలు లేకుండానే ఇటీవల ఐసీడీఎస్ పీడీ కార్యాలయం ఆ సమస్య పరిష్కారమైనట్లు ఎండార్స్‌మెంట్ ఇచ్చి చేతులు దులుపుకోవడం గమనార్హం.

ఫిర్యాదుపై ఒత్తిళ్లు

సీడీపీవో పాపినాయుడు, కంప్యూటర్ ఆపరేటర్ శ్రీనివాసరావుపై ఫిర్యాదు చేసిన వెంకటరమణకు నేరుగా పీడీ కార్యాలయం నుంచి ఫోన్‌కాల్స్ వెళ్తున్నాయి. తన ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలని, అందుకు నగదు, ఇంకేమైనా వేరే కాంట్రాక్టులు ఇప్పిస్తామని ఒత్తిడి చేస్తున్నట్లు ఫిర్యాదుదారుడు చెబుతున్నాడు. కాగా తనకు అన్యాయం జరిగిందని, ఇప్పటికే రెండు నెలలుగా సరుకులు పంచేందుకు అధికారులు సహకరించడం లేదని, తనకు న్యాయం జరగకపోతే మరోసారి జేసీ దృష్టికి తీసుకెళ్తానని ఆయన పేర్కొంటున్నారు.

థర్మల్ విద్యుత్ కేంద్రం ఏర్పాటు సరికాదు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఆదివాసీల సంస్కృతి, పర్యావరణాన్ని తీవ్రంగా దెబ్బతీసే థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు సరికాదని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర అన్నారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని సరుబుజ్జిలి, బూర్జ మండలాల పరిధిలో వెన్నెలవలసలో 3,200 మెగావాట్స్ సామర్థ్యంతో థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఏపీ జెన్‌కో నిర్మాణ ప్రతిపాదనను కూటమి ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. థర్మల్ విద్యుత్ కేంద్రం ఏర్పాటు జరి


సమావేశంలో మాట్లాడుతున్న సురేంద్ర

గితే రెండు మండలాల్లోని 20 గిరిజన గ్రామాల్లో ఉన్న సుమారు 5 వేల మంది గిరిజనుల జీవనాన్ని తీవ్రంగా దెబ్బ తీస్తుందన్నారు. విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నిర్మాణం వలన హిరమండలం వంశధార ప్రాజెక్ట్ పరిధిలో ఆధారపడిన వేల మంది రైతులు సాగునీరు అందక పంటపొలాలు బీడు భూములుగా మారిపోయే ప్రమాదముందని హెచ్చరించారు. చుట్టుపక్కల నీరు, గాలి కాలుష్యానికి గురవుతాయన్నారు. ఆదివాసీ ప్రాంతం అభివృద్ధి జరగాలంటే నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాలు షెడ్యూల్ ఏరియాలో కలపాలని డిమాండ్ చేశారు. అలాగే శ్రీకాకుళం జిల్లాలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలని కోరారు. ఆయనతో పాటు జిల్లా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.అప్పన్న, జిల్లా కమిటీ సభ్యులు ఎస్.జైరాం, మండల నాయకులు ఎస్.ప్రసాద్, ఎస్.శంకయ్య తదితరులు ఉన్నారు

పీహెచ్‌సీల సిబ్బంది నిరసన


నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న సరుబుజ్జిలి పీహెచ్‌సీ సిబ్బంది

అరసవల్లి: రాష్ట్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లు గత తొమ్మిది రోజులుగా నిరవధిక సమ్మెలో ఉన్న విషయం తెలిసిందే. దీంతో వారికి మద్దతుగా జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల సిబ్బంది సోమవారం నల్ల రిబ్బన్లు ధరించి విధులు నిర్వర్తించారు. కాగా విజయవాడలో మెడికల్ ఆఫీసర్లు నిరసన చేపడుతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో జిల్లాలో దాదాపుగా 71 పీహెచ్‌సీల్లోనూ సిబ్బంది నిరసన వ్యక్తం చేస్తూనే విధులు నిర్వర్తించారు.

అధికారులందరూ హాజరవ్వాలి


వినతులు స్వీకరిస్తున్న డీఆర్వో వెంకటేశ్వరరావు

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- పీజీఆర్ఎస్‌కు 92 వినతులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: అన్ని ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు తప్పనిసరిగా ప్రజా సమస్యల నమోదు మరియు పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు ప్రతి సోమవారం హాజరవ్వాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పలువురు క్రిందిస్థాయి అధికారులు వస్తూ సమస్యలకు సరైన సమాధానం ఇవ్వలేకపోతున్నారన్నారు. అందువలన ప్రతీశాఖ నుంచి బాధ్యతాయుతమైన, సమాధానం తెలిసిన అధికారి హాజరవ్వాలని స్పష్టం చేశారు. పీజీఆర్ఎస్‌లో వచ్చిన ఫిర్యాదుల తక్షణ పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. అనంతరం కొన్ని వినతులు స్వీకరించి కలెక్టరేట్ కార్యాలయంలో జరిగే సమావేశానికి వెళ్లారు. ఆయనతో పాటు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు. మొత్తం 92 వినతులు స్వీకరించినట్లు అధికారులు తెలియజేశారు.

వినతులు పరిశీలిస్తే..

- సీజేఐ గవాయ్‌పై దాడికి యత్నించిన వ్యక్తిపై కేసు నమోదు చేయాలని, ఇలాంటివి పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరుతూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ప్రతినిధులు టి.శ్రీనివాస్, ఎల్.తేజేశ్వరరావు, డి.తిరుపతి తదితరులు ఫిర్యాదు చేశారు.
- ఆక్రమణదారుల నుంచి రక్షించి తమ భూములు ఇప్పించాలని ఆమదాలవలస మండలంలోని దూసి గ్రామానికి చెందిన దళితులు కోరారు. కొన్ని సంవత్సరాలుగా ఆక్రమణదారుల కబ్జాకు గురైన డీ-పట్టా భూములను ఇప్పించాలని 17 దళిత కుటుంబాలకు చెందిన వ్యక్తులు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుదారుల్లో ఎడ్ల కల్యాణి, బొంతల లత, ఎం.లక్ష్మి, యారబాటి పార్వతి, కలివరపు శ్రీలత, యారబాటి రాములమ్మ, అన్ను లక్ష్మి, బొడ్డేపల్లి లక్ష్మీ భవానీ, బొడ్డేపల్లి లక్ష్మి, మన్యాల రామారావు తదితరులు ఉన్నారు.
- శ్రీకాకుళం నగరంలోని బాదుర్లుపేట దరి వాంబే కాలనీకి చెందిన మెండ రాములు తనకు ప్రభుత్వం నుంచి ఇంటి స్థలం ఇప్పించాలని కోరారు.
- లావేరు మండలంలోని చిన్నయ్యపేట గ్రామానికి చెందిన కలిశెట్టి రాములు తనకు, తన కుటుంబానికి తన కోడలు మరికొంతమంది కలిసి వేధిస్తున్నారు. తన ఆస్తిని, ఇతర వస్తువులను తీసుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు న్యాయం చేయాలని అధికారులను కోరారు.
- తమను డీఎస్సీ ద్వారా నిబంధన మేరకు ఉద్యోగ నియమకాలు చేసినప్పటికీ, సుమారుగా 12 వందల మందిని విధుల నుంచి తొలగించారని, తిరిగి జీవో 12-7 ప్రకారం విధుల్లోకి తీసుకోవాలని హెల్త్ అసిస్టెంట్లు కోరారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 50 వినతులు

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ మరియు పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో అదనపు ఎస్పీ (క్రైమ్) పాత్రిని శ్రీనివాసరావు ప్రజల నుంచి 50 వినతులు స్వీకరించారు. సంబంధిత పోలీసు అధికారులకు జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా తక్షణమే బాధితుని గోడు తెలియజేసి, చట్టప్రకారం న్యాయం చేయాలని అదనపు ఎస్పీ ఆదేశించారు. అనంతరం వృద్ధులు, వికలాంగుల వద్దకు వెళ్లి సమస్యలను తెలుసుకున్నారు.


వృద్ధుడి గోడు వింటున్న అదనపు ఎస్పీ శ్రీనివాసరావు

నవంబర్ 3 నుంచి మున్సిపల్ కార్మికుల సమ్మె

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నవంబర్ 3వ తేదీ నుంచి ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) అనుబంధ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేపడతామని ఏఐటీయూసీ కౌన్సిల్ సభ్యుడు టి.తిరుపతిరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కల్యాణి అప్పలరాజు తెలిపారు. కార్మికుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావుకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని కోరారు. రాష్ట్రంలోని వివిధ మున్సిపల్ కార్పొరేషన్లు, నగర పంచాయతీల్లో గత రెండు సంవత్సరాలుగా చనిపోయిన, రిటైరైన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు తిరిగి ఔట్ సోర్సింగ్ పద్ధతిలో ఉపాధి కల్పించాలని కోరారు. 12వ పీఆర్సీని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. మధ్యంతర భృతి 30 శాతం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు డి.రమణ, ఆర్.గణేష్, సీతమ్మ, రామచంద్ర, ఢిల్లి తదితరులు పాల్గొన్నారు.


కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

వివాహిత అదృశ్యం

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్సు వద్ద ఒక వివాహిత అదృశ్యమైనట్లు రెండో పట్టణ సీఐ పి.ఈశ్వరరావు సోమవారం వెల్లడించారు. గార మండలం కళింగపట్నానికి చెందిన సంతోషి(21)కి విజయవాడకు చెందిన భక్తుల వెంకటేశ్వరరావుతో నాలుగేళ్ల క్రితం ప్రేమ వివాహమైంది. తరచూ ఫోన్‌లో గడపడంతో భార్యభర్తల మధ్య మనస్పర్థలు వచ్చాయి. దీంతో ఆరు నెలల క్రితం కళింగపట్నంలోని పుట్టింటికి వచ్చేసింది. ఈ క్రమంలో ఈనెల 8వ తేదీన విజయనగరంలో పండగకు కుమార్తె బయల్దేరడంతో శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్సులో బస్సు ఎక్కించానని తల్లి వనుము సూరమ్మ తెలిపారు.

అప్పటినుంచి అదృశ్యమైందని ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

వ్యాధుల కాలం... జీవాలు భద్రం..!

సరుబుజ్జిలి: ఇటీవల జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పలుచోట్ల వర్షపు నీరు చేరింది. మనుషులు మాదిరిగా పశువులకు కూడా అనేక రకాల అంటువ్యాధులు ప్రబలే అవకాశాలు అధికంగా ఉన్నాయి. అందువలన సీజనల్‌గా వచ్చే వ్యాధులపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. పలు ముందస్తు రక్షణ చర్యలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. పశువులకు వచ్చే సీజనల్ వ్యాధులను పరిశీలిస్తే...


లంపిస్కిన్ వ్యాధి సోకిన పశువులు(ఫైల్)

చిటుకు వ్యాధి

వర్షాకాలంలో గొర్రెలకు చిటుకు వ్యాధి బాక్టీరియా వలన అధికంగా వస్తుంది. దీనివలన ఉన్నటుండి గాలిలో ఎగిరి గొర్రెలు చనిపోతాయి. దీనికోసం ముందుగా నీరసంగా ఉన్న గొర్రెలను మంద నుంచి వేరుచేయాలి. వ్యాధి నివారణకు పెన్సిలిన్ వేయించాలి. వ్యాధిసోకని వాటికి వ్యాక్సిన్ వేయించాలి.

నీలి నాలుక

నీలి నాలుక గొర్రెలు, మేకల్లో వస్తుంది. ఈ వ్యాధి సోకిన జీవాలకు జ్వరంగా అధికంగా వస్తుంది. నోటి నుంచి చొంగ కారుస్తూ, గిట్టలకు పుండ్లు ఏర్పడతాయి. ఈ వ్యాధి నివారణకు యాంటీ బయాటిక్స్, లివర్ టానిక్ ఉపయోగించి జీవాలను మంద నుంచి వేరు చేయాలి.

గొంతువాపు వ్యాధి

ఈ వ్యాధి అన్ని వయస్సుల ఆవులు, గేదెల్లో కనిపిస్తుంది. 105 నుంచి 108 డిగ్రీల జ్వరం వస్తుంది. నోటి నుంచి చొంగలు కారుస్తూ.. నోటి నుంచే గాలి పీల్చుకుంటాయి. గొంతవద్ద వాపు వలన మేత తీసుకోలేవు. నివారణకు సల్ఫాడిమిడిన్ వాడుతూ, 4 నెలలు దాటిన జీవాలకు వ్యాక్సినేషన్ చేయించాలి.

గాలికుంటు వ్యాధి

ఇది అన్ని జీవాల్లో కనిపిస్తుంది. నోరు, గిట్లలో పుండ్లు ఏర్పడి ఎక్కువగా జ్వరం ఉంటుంది. నివారణకు బోరిక్ గ్లిజరిన్ ఆయింట్‌మెంట్‌ను నోటిలో పూత పూయాలి. పీపీ ద్రావణంతో కాలిగిట్ల మధ్య శుభ్రం చేయాలి. ప్రతిఏటా ముందస్తుగా ఏప్రిల్, మే నెలల్లో వ్యాక్సిన్ వేయించాలి.

అవగాహన కల్పించాలి



పశుసంవర్ధక శాఖ అధికారులు దిగువ స్థాయిలో సిబ్బందిపై పశువైద్య సేవల బాధ్యతలు పెట్టకుండా క్షేత్రస్థాయిలో పర్యటనలు చేస్తే సమస్యలు గుర్తించవచ్చు. సీజనల్‌గా వచ్చే వ్యాధులు గురించి పాడి రైతులకు గ్రామాల్లో అవగాహన కల్పించాలి. సిబ్బంది పనితీరు మెరుగుపరచాలి.

– పైడి మోహనరావు, మతలబుపేట, సరుబుజ్జిలి

శిబిరాలతో సరిపెడుతున్నారు



పశువైద్య శాఖ అధికారులు అడపాదడపా పశువైద్య శిబిరాలు పెట్టి తమ బాధ్యత తీరిందన్న చందంగా వ్యవహరిస్తున్నారు. పశువుల పెంపకం, సంక్రమించే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించాలి. లంపిస్కిన్ వ్యాధితో అప్పట్లో చాలావరకు పశు నష్టాలు చవిచూశాం.

– చల్ల యర్రయ్య, చిగురువలస, సరుబుజ్జిలి

● నైవేద్యాల నివేదన

శ్రీకాకుళం నగరంలోని నక్కవీధిలో ఉన్న ఉమాజఠలేశ్వరస్వామి దేవాలయంలో జరుగుతున్న నందెన్న ఉత్సవాల్లో భాగంగా సోమవారం 25 నైవేద్యాలు సమర్పించారు. ఆలయ అర్చకులు అశ్వనీకుమార్, మహేష్‌ల ఆధ్వర్యంలో నందెన్నకు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

- శ్రీకాకుళం కల్చరల్



బైక్ పైనుంచి జారిపడి మహిళా మృతి

ఇచ్ఛాపురం రూరల్: ప్రమాదవశాత్తు బైక్ పైనుంచి జారిపడి మహిళ మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని పాయితారి గ్రామానికి చెందిన బారికాని బెహరా(52) అనే మహిళ, ఒడిశాకు చెందిన తన అల్లుడు మహేశ్వర బెహరాతో కలిసి ఆదివారం ద్విచక్ర వాహనంపై అరకభద్రలో జరిగిన శుభకార్యానికి వెళ్లింది. అనంతరం తిరిగి వస్తుండగా మార్గమధ్యలో బైక్ పైనుంచి జారి రోడ్డుపై పడడంతో తలకు బలమైన గాయమైంది. దీంతో స్థానికులు హుటాహుటిన ఇచ్ఛాపురం సీహెచ్‌సీలో చేర్పించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో బరంపురం మెడికల్ కళాశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం వేకువజామున మృతి చెందింది. మృతురాలి కుమారుడు హరిశ్చంద్ర బెహరా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందని హెడ్ కానిస్టేబుల్ వై.తిరుపతి రావు తెలిపారు.

లారీని ఢీకొన్న టాటా మ్యాజిక్

నందిగాం: మండల పరిధిలోని నర్సిపురం సమీపంలో జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని టాటా మ్యాజిక్ వ్యాన్ ఢీకొనడంతో వ్యాన్‌లో ఉన్న తొమ్మిది మంది గాయాలపాలయ్యారు. నందిగాం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఇచ్ఛాపురం మండలం ధర్మపురం గ్రామానికి చెందిన పిట్ట చంద్రశేఖర్‌తో పాటు మరో 8 మంది టాటా మ్యాజిక్ వ్యాన్‌లో ఆదివారం ఉదయం ఒడిశా రాష్ట్రంలోని రాయగడలో మజ్జిగౌరి అమ్మవారి దర్శనం చేసుకున్నారు. అనంతరం తిరిగి గ్రామానికి వస్తుండగా ఆదివారం రాత్రి మండల పరిధిలోని నర్సిపురం సమీపంలో ఆగి ఉన్న లారీని వెనుకనుంచి ఢీకొట్టారు. దీంతో వ్యాన్‌లో ఉన్న 9 మందికి చిన్న, చిన్న గాయాలయ్యాయి. ప్రమాదం విషయం తెలుసుకున్న నేషనల్ హైవే అంబులెన్స్ సిబ్బంది అక్కడకు చేరుకొని క్షతగాత్రులను టెక్కలి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. చంద్రశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నందిగాం ఎస్ఐ షేక్ మహ్మద్ ఆలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి

పొందూరు: మండలంలోని పుల్లాజీపేట గ్రామంలో సోమవారం విద్యుత్ షాక్‌తో జాడ ఉమామహేశ్వరరావు(38) అనే యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని జాడపేట గ్రామానికి చెందిన ఉమామహేశ్వరరావు 13 ఏళ్ల క్రితం పుల్లాజీపేటకు చెందిన నాగమణిని వివాహం చేసుకుని, పుల్లాజీపేటలోనే ఎలక్ట్రీషియన్‌గా స్థిరపడ్డాడు. సోమవారం గ్రామంలో పి.సుబ్బారావు ఇంట్లో గ్రీజర్ మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురయ్యారు. వెంటనే కుటుంబ సభ్యులు శ్రీకాకుళం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య నాగమణితో పాటు 6వ తరగతి చదువుతున్న కుమార్తె ప్రణన్య ఉంది. ఉమామహేశ్వరరావు మృతితో గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి.


మృతుడు ఉమామహేశ్వరరావు